క్లుప్తంగా

నేడు సమిశ్రగూడెంలో మెగా వైద్యశిబిరం

నిడదవోలు రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని మండలంలోని సమిశ్రగూడెం అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. తృప్తి చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో నిర్వహించే ఈ శిబిరంలో రాజమహేంద్రవరం కిమ్స్ (బొల్లినేని) హాస్పిటల్‌కు చెందిన 15 మంది వైద్య బృందం వచ్చి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిటీ సభ్యులు కోరారు.

రోగి వైద్యానికి 'మానవత' ఆర్థిక సాయం



క్షతగాత్రుడికి ఆర్థిక సాయం చేస్తున్న మానవత సంస్థ సభ్యులు

తాళ్లపూడి: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన అన్నదేవరపేటకు చెందిన ములపర్తి దీవెనకుమార్ వైద్య ఖర్చుల నిమిత్తం బుధవారం మానవత స్వచ్ఛంద సంస్థ మండలశాఖ ఆర్థిక సాయం చేశారు. మానవత సంస్థ తరపున రూ.5 వేలు, చెరుకూరి బంగారుబాబు రూ.1000, కవల రామాంజనేయులు రూ.1000, మేకా శ్రీనివాస్ రూ.500, మొత్తం రూ.7500 సొమ్మును ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షుడు జె.వెంకటేశ్వరరావు చేతుల మీదుగా క్షతగాత్రుడికి అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఆ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

రామాలయం వద్ద అన్నదానం

చాగల్లు: శ్రీరామనవమి వేడుకలు ముగిసిన సందర్భంగా కలవలపల్లిలో బుధవారం అన్న సమారాధన నిర్వహించారు. గౌడ సంఘం రామాలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అన్న సమారాధనలో రామచంద్రాపురం, చిక్కాలపాలెం, బ్రాహ్మణగూడెం తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చాగల్లు తహసీల్దార్‌గా రాజ్యలక్ష్మి



చాగల్లు: చాగల్లు తహసీల్దార్‌గా కె.రాజ్యలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరంలోని కలెక్టర్ కార్యాలయం నుంచి బదిలీపై ఆమె ఇక్కడికి వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ఎం.శ్రీనివాసరావు కొంతకాలం క్రితమే డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొంది బదిలీపై వెళ్లారు. దాంతో ఇప్పటి వరకూ డిప్యూటీ తహసీల్దార్ కె.నిరంజన్ ఇన్‌చార్జిగా తహసీల్దార్‌గా కొనసాగారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మికి డిప్యూటీ తహసీల్దార్లు కె.నిరంజన్‌కుమార్, కె.ఆనంద్‌కుమార్, కార్యాలయం సిబ్బంది శుభాభినందనలు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న సివిల్ సప్లయిస్ డీటీ సుజాత, సిబ్బంది

నల్లజర్ల: విజయవాడ నుంచి తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేటకు మినీ వ్యాన్‌లో అక్రమంగా రవాణా చేస్తున్న రెండు టన్నుల మూడు క్వింటాళ్ల 50 కిలోల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ వై.సుజాత, సిబ్బంది బుధవారం తెల్లవారుజామున వీరవల్లి టోల్‌ప్లాజా వద్ద దాడి చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా జగ్గంపేటకు చెందిన సురేష్ అనే వ్యక్తిపై 6ఏ కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని గోపాలపురం ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. ఈ దాడిలో వీఆర్ఏ సత్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీ వద్దే చేపల విక్రయాలు



నల్లజర్ల నంబరు-1 ప్రాథమిక పాఠశాల పక్కనే చేపల విక్రయాలు

నల్లజర్ల: స్థానిక నంబర్-1 ప్రాథమిక పాఠశాల పక్కనే చేపల విక్రయాలు సాగించడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పాఠశాల ప్రహరీని ఆనుకునే వ్యాపారులు నిత్యం చేపల విక్రయాలు సాగిస్తున్నారు. చేపల వ్యర్థాలను, చేపలు కడిగిన నీటిని అక్కడే వదిలేయడంతో ఆ దుర్వాసన భరించలేక విద్యార్థులు ఇక్కట్లకు గురువుతున్నారు. ఈ సమస్యను ఆ పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ కూరపాటి నాగరాజు పలుమార్లు చేపల విక్రయదారుల దృష్టికి తీసుకెళ్లినా, వారు ఖాతరు చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. పంచాయతీ అధికారులు జోక్యం చేసుకొని చేపల విక్రయాలను ఇక్కడి నుంచి మరో ప్రాంతానికి తరలించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పీహెచ్‌సీల్లో 63 రకాల వైద్య పరీక్షలు

- అందుబాటులోకి అధునాతన యంత్ర పరికరాలు
- శిక్షణ పొందుతున్న ల్యాబ్ టెక్నీషియన్లు
- నెలాఖరు నుంచి సేవల ప్రారంభం



నల్లజర్ల పీహెచ్‌సీ చేరిన అధునాతన పరికరాలు

నల్లజర్ల: ఇకపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మరిన్ని వైద్య పరీక్షలు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం వైద్య, ఆరోగ్యశాఖ అధునాతన యంత్ర పరికరాలను పీహెచ్‌సీలకు అందజేసింది. ఒక్కో పీహెచ్‌సీకి సీబీసీ, ఎలక్ట్రోలైట్ ఎన్‌లైజర్, బయోకెమిస్ట్రీ ఎనలైజర్, యూరిన్ ఎన్‌లైజర్, టీబీ ఆర్టీ పీఆర్ యంత్ర పరికరాలను సమకూర్చారు. ఇప్పటి వరకూ పీహెచ్‌సీలలో కేవలం 15 నుంచి 20 రకాల వైద్య పరీక్షలు మాత్రమే అందుబాటులో ఉండేవి. కొత్తగా చేరిన పరీక్షలతో కలిపి ఇకపై వాటి సంఖ్య 63కు పెరగనుంది. వైద్య పరీక్షల నిర్వహణ కోసం ప్రతి పీహెచ్‌సీకి ఒక ల్యాబ్ టెక్నీషియన్‌ను కూడా నియమించారు. ప్రస్తుతం వారికి జిల్లా స్థాయిలో రాజమహేంద్రవరంలో శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ 22 రోజుల పాటు జరుగుతుంది.

ఎంతో మేలు..

గతంలో పీహెచ్‌సీలలో చాలా రకాల వైద్య పరీక్షలు అందుబాటులో లేకపోవడంతో వాటి కోసం రోగులు సమీప ఏరియా ఆసుపత్రి, లేదా జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేది. ఇది సహజంగానే రోగులకు ఆర్థికభారం అయ్యేది. అదనంగా శ్రమ పడాల్సి వచ్చేది. దీనివల్ల రోగ నిర్ధారణకు ఎక్కువ సమయం పట్టేది. అప్పటి వరకూ రోగికి ఖచ్చితమైన వైద్యం అందేది కాదు. పరీక్షల కోసం దూర ప్రాంతాలకు వెళ్లలేని కొందరు పేద రోగులు సైతం ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించేవారు. ప్రస్తుతం అదనపు వైద్య పరీక్షలు పీహెచ్‌సీలలోనే అందుబాటులోకి రావడంతో కొన్ని గంటల వ్యవధిలోనే రోగుల వ్యాధి నిర్ధారణకు వీలవుతుంది. ఫలితంగా వెంటనే రోగికి మెరుగైన వైద్యసేవలు అందించడానికి అవకాశం కలుగుతుందని స్థానిక కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె.చంద్రశేఖరరాజు చెప్పారు.

ఇవీ చేసే వైద్య పరీక్షలు

సీఆర్‌పీ, ఎస్‌జీఓటీ, ఎస్‌జీపీటీ, యూఆర్‌ఈఏతో పాటు హిమోగ్లోబిన్, ప్లేట్‌లెట్ కౌంట్, సీబీసీ, టోటల్ బ్లడ్ సెల్‌కౌంట్, ర్యాండమ్ బ్లడ్ షుగర్, బ్లడ్ యూరియా, సీరం సోడియం, హెచ్‌ఐవీ, హెపటైటిస్-బి, డెంగీ, బ్లీడింగ్, క్లాటింగ్ టైమ్, థైరాయిడ్, పొటాషియం, క్లోరైడ్ తదితర 63 రకాల పరీక్షలు చేయనున్నారు.

త్వరలోనే అందుబాటులోకి..



ఈనెలాఖరు నాటికి 63 రకాల వైద్య పరీక్షలు రోగులకు అందుబాటులోకి వస్తాయి. ఇకపై పరీక్షలు కోసం పట్టణ ప్రాంతాలకు పేద రోగులు వెళ్లనవసరం లేదు. త్వరగా రోగ నిర్ధారణ అవుతుంది. వెంటనే అవసరమైన వైద్యాన్ని అందిస్తాం.

– డాక్టరు తెల్లం గంగాధరరావు, పీహెచ్‌సీ డాక్టర్, నల్లజర్ల

పరికరాలు పీహెచ్‌సీకి చేరాయి



రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేయడానికి అవసరమైన పరికరాలు, మెషినరీ ఇప్పటికే పీహెచ్‌సీకి చేరాయి. వైద్య పరీక్షలు ఎలా చేయాలో ప్రాథమికంగా కొంత శిక్షణ కూడా ఇచ్చారు. మరో 11 రోజుల శిక్షణ పూర్తి చేయవలసి ఉంది. త్వరలోనే పీహెచ్‌సీలో పేదలకు అన్ని రకాల పరీక్షలు ఉచితంగా అందుబాటులోకి వస్తాయి.

– ఎన్‌డీ ఉనూర్ షరీఫ్, ల్యాబ్ టెక్నీషియన్, నల్లజర్ల పీహెచ్‌సీ

అగ్రవర్ణ పేద మహిళల లబ్ధికే ఈబీసీ నేస్తం



నిడదవోలులో సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఈబీసీ నేస్తం లబ్ధిదారులు

నిడదవోలు రూరల్: అగ్రవర్ణ పేద మహిళలకు కూడా మేలు చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకాన్ని అమలు చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. నిడదవోలు పట్టణం, మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల్లో రెండో విడత ఈబీసీ నేస్తం పథకంపై అవగాహన కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. పట్టణంలోని నెహ్రూనగర్‌లోని 1,2 సచివాలయాల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు మద్దిపాటి ఫణీంద్ర, కౌన్సిలర్ ఎస్‌కే వజీరుద్దీన్, కమిషనర్ కేవీ పద్మావతి పాల్గొన్నారు. నిడదవోలు 6వ సచివాలయంలో వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు పువ్వల రతీదేవి, కొత్తపల్లి సుప్రియ, ఈబీసీ నేస్తం లబ్ధిదారులు సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు గంగుల గోపీ యాదవ్, కొత్తూరి శ్రీను, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమం,అభివృద్ధికి పట్టం కట్టండి

- జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలి
- నెలటూరు, కలవలపల్లి సభల్లో హోం మంత్రి తానేటి వనిత



నెలటూరు సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి తానేటి వనిత

చాగల్లు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో మరే రాష్ట్రంలోనూ అమలు కావడం లేదని, అలాంటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని హోం మంత్రి తానేటి వనిత విజ్ఞప్తి చేశారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని నెలటూరు, కలవలపల్లి గ్రామాల్లో వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశాలు నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ సీఎం జగనన్న సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా పెద్ద పీట వేస్తున్నారన్నారు.అయితే విపక్షాలు ఓర్వలేక ప్రభుత్వంపై బురద జల్లే కార్యక్రమం పెట్టుకున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయంలో జన్మభూమి కమిటీల పేరుతో పేదలను దోచుకున్నారని మంత్రి ఆరోపించారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 20 లోగా ప్రతి వలంటీర్ తమ పరిధిలోని 50 కుటుంబాలను సందర్శించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని కోరారు.

గ్రామ స్వరాజ్య సాధనకే వలంటీర్ వ్యవస్థ

గ్రామ స్వరాజ్య సాధన దిశగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారని మంత్రి వనిత అన్నారు.అందులో భాగంగానే పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలన్నీ అర్హులైన పేదలకు అందాలనే సదాశయంతో వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేశారన్నారు. గ్రామ వలంటీర్లు, గృహ సారథులు, స్థానిక ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో సమన్వయంతో పనిచేసి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మళ్లీ ఎన్నికలు వస్తున్నందున ప్రతిపక్షాలు పలు ప్రలోభాలకు గురిచేస్తాయని, వాటిని ఎవరూ నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైస్ ఎంపీపీలు జుజ్జవరపు రామచంద్రరావు, చెల్లింకుల శ్రీవిజయ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, పార్టీ మండల గౌరవాధ్యక్ష, అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సొసైటీల అధ్యక్షులు గూడపాటి శివ, సుంకర రాయుడు, పార్టీ సీనియర్ నాయకులు లకంసాని సూర్యప్రకాశరావు, గేడా శ్యామ్, ప్రత్తిపాటి రామచంద్రరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో అయ్యవార్ల అసభ్య ప్రవర్తన!

- ఇద్దరు టీచర్ల చర్యలతో భీతిల్లుతున్న తల్లిదండ్రులు
- చూసీచూడనట్టుగా అధికారుల వ్యవహార శైలి

తాళ్లపూడి: మండలంలోని ఇద్దరు ఉపాధ్యాయులపై విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. వారి చర్యలతో మండలంలోని ప్రాథమిక పాఠశాలల చిన్నారులకు సైతం రక్షణ లేని పరిస్థితి నెలకొంది. వారి విషయంలో అధికారులు కూడా చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తూ పలు అవకాశాలు ఇస్తున్నారు. అయినప్పటికీ ఆ ఇద్దరి పనితీరులో మార్పు మాత్రం రావడం లేదు. మండలంలోని ఓ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు, మరో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఉదంతాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. అధికారులు, తోటి ఉపాధ్యాయుల అండతో వీరు ఎప్పటికప్పుడు బయట పడుతున్నారు. పోచవరం ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసిన ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో గ్రామస్తులు తీవ్రంగా స్పందించారు. ఆ టీచర్ తమ గ్రామంలో పనిచేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. దీంతో అధికారులు ఆ టీచర్‌ను డిప్యుటేషన్‌పై గజ్జరం ప్రాథమిక పాఠశాలకు పంపారు. అక్కడ కూడా ఆయన ప్రవర్తన మారకపోవడంతో బల్లిపాడు జూనియర్ బేసిక్ పాఠశాలకు పంపించారు. ఈ డిప్యుటేషన్‌కు ఆ టీచర్ పనితీరు అని కాకుండా, ఉపాధ్యాయుల సర్దుబాటు కారణం అంటూ అధికారులు కవర్ చేసుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఆ టీచర్ విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడమే కాదు. రోజూ మద్యం సేవించి పాఠశాలకు వస్తుంటారు.

అలాగే వేగేశ్వరపురం హైస్కూల్లో పనిచేస్తున్న మరో ఉపాధ్యాయుడు ఇటీవల ఓ విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. దీనిపై విద్యార్థినులు ఉత్తరాల ద్వారా విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా వారు ఆ టీచర్‌ను మందలించి వదిలివేసినట్టు సమాచారం. ఈ ఇద్దరు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు విద్యాశాఖ ఉన్నతాధికారులను కోరుతున్నారు.

సర్వ మతాలకు జగన్ సమ ప్రాధాన్యం

మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్వ మతాలకు సమ ప్రాధాన్యం ఇస్తున్నారని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. ఐ.పంగిడి గ్రామంలో బుధవారం నిర్వహించిన క్రిస్టియన్ ఆర్గనైజేషన్స్ నెట్‌వర్క్ లీడర్ షిప్ కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. అంతర్జాతీయ సువార్త ప్రసంగీకుడు బ్రదర్ అనిల్‌కుమార్ సభలో ప్రార్థన చేసి హోం మంత్రి వనితను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఏసుక్రీస్తు కేవలం క్రైస్తవులకు మాత్రమే చెందిన వారు కాదన్నారు. ప్రపంచ శాంతికోసం పుట్టిన మహనీయుడని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్పర్జన్‌బాబు, పలు ప్రాంతాలకు చెందిన ప్రముఖ పాస్టర్లు పాల్గొన్నారు.

నేడు కొవ్వూరు 12వ వార్డులో గడప గడపకూ..

కొవ్వూరు: పట్టణంలోని 12వ వార్డులో గురువారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి హోం మంత్రి తానేటి వనిత గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తారని వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు బుధవారం తెలిపారు. మంత్రి నివాసం వద్ద నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య

దేవరపల్లి: స్థానిక మంగతాయారు జీడిగింజల ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికుడు నెయ్యల గణేష్ (44) మనస్థాపంతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ పట్టణం పద్మనాభపురం కాలనీ గణేష్ సొంతూరు. కొంతకాలంగా దేవరపల్లిలోని జీడిగింజల ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం మరొక వివాహితను తీసుకుని దేవరపల్లి వచ్చాడు. ఫ్యాక్టరీ వద్ద గల రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న ఆ మహిళ భర్త మంగళవారం దేవరపల్లి వచ్చి తన భార్యను తీసుకుని వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపానికి గురైన గణేష్ మంగళవారం రాత్రి షెడ్డులో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి స్నేహితుడు జోగి పాపారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు.

గోదావరిలో మృతదేహం లభ్యం

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రం వద్ద గోదావరిలో 40 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని పురుషుడి మృతదేహాన్ని బుధవారం పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు టౌన్ పోలీసు స్టేషన్ హెచ్‌సీ జె. శ్రీనివాసరావు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. వివరాల కోసం పట్టణ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

పండ్ల తోటల సాగుకు 'ఉపాధి' ఊతం

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- క్షేత్ర స్థాయి సిబ్బందితో సమీక్ష



ఉపాధి పనులపై క్షేత్ర స్థాయి సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. నియోజకవర్గంలో గతేడాది చేసిన, ఈ ఏడాది చేపడుతున్న ఉపాధి పనులపై అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో ఎమ్మెల్యే సమీక్ష జరిపారు. దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ సమీక్షలో ఎమ్మెల్యే మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరంలో దేవరపల్లి మండలం ఉపాధి పనుల లక్ష్యాన్ని అధిగమించి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. 3.28 లక్షల పనిదినాలు లక్ష్యం కాగా దానిని నూరు శాతం పూర్తి చేసినట్టు చెప్పారు. రూ.6 కోట్ల విలువైన పనులను పూర్తయ్యాయన్నారు. ఈ ఏడాది 2.90 లక్షల పనిదినాలు చేయవలసి ఉందని, దీనికి రూ.10.30 కోట్లు లేబరు బడ్జెట్ కేటాయించినట్టు వెల్లడించారు. పండ్ల తోటల పెంపకానికి మండలాల వారీగా దేవరపల్లిలో 30, నల్లజర్లలో 15 , గోపాలపురంలో 15, ద్వారకాతిరుమలలో 28 ఎకరాలను ఎంపిక చేసినట్టు వివరించారు. పండ్ల తోటల పెంపకానికి సన్న, చిన్నకారు రైతులకు ఎకరాకు ఏడాదికి రూ.48 వేల చొప్పున ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. అర ఎకరం నుంచి 5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులు ఈ పంటల సాగుకు అర్హులన్నారు. జీడిమామిడి, మామిడి, కొబ్బరి, నిమ్మ, బత్తాయి, జామ, డ్రాగన్ ఫ్రూట్, నేరేడు, దానిమ్మ, చింత, సపోట, తైవాన్ జామ, మునగ పంటలు వేసుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈ సమీక్షలో ఏపీఓ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటా జగనన్నే మా భవిష్యత్తు

- హోం మంత్రి తానేటి వనిత, జక్కంపూడి రాజా
- ఇంటింటికీ ప్రజాప్రతినిధులు
- ప్రజల నుంచి అనూహ్య స్పందన



కొవ్వూరు నాలుగో వార్డులో మునిసిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి తదితరులు



తాడిపూడి కార్యక్రమంలో మంత్రి తానేటి వనిత. చిత్రంలో జక్కంపూడి రాజా తదితరులు

తాళ్లపూడి: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లగా జగనన్న నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని తాడిపూడిలో జరుగుతున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో బుధవారం మంత్రి తానేటి వనిత, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొన్నారు. గృహసారథులు, వలంటీర్లతో కలిసి స్టిక్కర్లు అతికించారు. మంత్రి వనిత మాట్లాడుతూ ప్రతినోటా జగనన్నే మా భవిష్యత్తు నినాదం వినిపిస్తోందన్నారు. జక్కంపూడి రాజా మాట్లాడుతూ జగనన్న పాలనలో అర్హత ఉంటే ఎలాంటి సిఫార్సు లేకుండా సంక్షేమ పథకాలు ఇంటికి వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, సర్పంచ్ నామా శ్రీనివాస్, నాయకులు తిరుమలశెట్టి అన్నవరం, మండిగ గిరి, తోట రామకృష్ణ, కొలుకుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు: నిడదవోలు క్లస్టర్‌లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. ప్రజల నుంచి అనూహ్య లభిస్తోంది. కొవ్వూరు నాలుగో వార్డులో బుధవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి ఇంటింటికీ వెళ్లి గత టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనకు గల వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించారు. పాలనా వ్యత్యాసంపై చైర్‌పర్సన్ ఐదు ప్రశ్నలు అడిగి, సమాధానాలను ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేశారు. సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. గుబతాల సురేష్, బొంతా శ్యాంకుమార్, చెల్లె ప్రసాద్, కోనాల శాంతకుమారి తదితరులతో పాటు గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజా మద్దతు అడిగారు. అలాగే 12వ వార్డులో కౌన్సిలర్ అంకోలు లిల్లీ వెంకటపద్మలీల, నాయకుడు గోశాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జగనన్నతోనే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు.

తాళ్లపూడి: మండలంలోని పైడిమెట్ట గ్రామంలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు. ఎంపీపీ పోశిరాజు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకున్న తీరు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇంటి యజమానుల అనుమతితో జగనన్నతోనే మా భవిష్యత్తు స్టిక్కర్లను ఇంటి గోడలకు అతికించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ యాళ్ల బాబురావు, మండల ఇన్‌చార్జి ముళ్ల పోశిబాబు, కొల్లి దుర్గారావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్దేవంలో సర్పంచ్ తిరిగిపల్లి వెంకటరావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: సంక్షేమ పథకాల అమలుతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటలే ప్రజలకు భరోసా, నమ్మకమని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అన్నారు. నిడదవోలు పట్టణంలోని పలు వార్డుల్లో, మండలంలోని తాడిమళ్ల, రావిమెట్ల, కంసాలిపాలెం, పెండ్యాల, గోపవరం, సమిశ్రగూడెం, పందలపర్రు, విజ్జేశ్వరం గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రజామద్దతు పుస్తకంలోని ఐదు ప్రశ్నలు అడిగి వారి జవాబులను నమోదు చేశారు. ఇంటి యజమానులే మా నమ్మకం నువ్వే జగన్ డోర్ స్టిక్కర్లను అంటించుకున్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలో పాలంగిలో ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, నిడదవోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెలిచేటి జానకి రామయ్య ఆధ్వర్యంలో జగనన్నే మా భవిషత్తు కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల అమలు తీరును వివరించి బ్రోచర్లు పంపిణీ చేశారు. అలాగే చివటంలో సొసైటీ అధ్యక్షుడు కొఠారి సత్యనారాయణ, సూర్యారావుపాలెంలో గుల్లపల్లి ఉదయభాస్కర్, దుద్దుపూడి వీసు, పిచ్చుకుల రాఘవులు, ఎంపీటీసీ సభ్యురాలు పి.అనంత లక్ష్మి, సత్యవాడలో సర్పంచ్ ఇందుకూరి దేవీభార్గవి ఆధ్వర్యంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు జగనన్నే మా భవిషత్తు కార్యక్రమం నిర్వహించారు.

పెరవలి: జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. కానూరు, నడుపల్లి, ఉసులుమర్రు, కానూరు అగ్రహారం, ఖండవల్లి గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షులు కొమ్మిశెట్టి రాము, అంబటి బ్రహ్మయ్య, నడుపల్లి సర్పంచ్ బీరా సత్యవతి రాజు, దొావులూరి శ్రీను, రామడుగుల సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



దంత వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పెరవలి: లయన్స్ క్లబ్‌లు ఏర్పాటు చేసే వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ పెరవలి శాఖ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి సూచించారు. లయన్స్ క్లబ్ పెరవలి శాఖ ఆధ్వర్యంలో కానూరులో బుధవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. కోలా లక్ష్మీసీతయ్య నాయుడి ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో భీమవరానికి చెందిన విష్ణు దంత వైద్య కళాశాల వైద్యులు 110 మందికి పరీక్షలు చేశారు. వారిలో 65 మంది దంతాలు క్లీనింగ్, 18 మందికి సిమెంట్ ఫిల్లింగ్ చేశారు మరో 27 మందిని తదుపరి చికిత్స కోసం సిఫార్సు చేసి నట్టు డాక్టర్ ఆదిత్య తెలిపారు. లయన్స్ క్లబ్ సెక్రటరీ ఉదయ భాస్కరరావు, సభ్యులు పాల్గొన్నారు.

లైబ్రరీ ఏర్పాటు చేయాలి

నిడదవోలు రూరల్: చర్చిపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని కేవీపీఎస్ నాయకులు జువ్వల రాంబాబు కోరారు. కేవీపీఎస్ నాయకులు, పూలే, అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం సభ్యులు కలిసి మున్సిపల్ మేనేజర్ బి.లక్ష్మికి ఈ మేరకు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. పాఠశాలలో ఒక గదిని కేటాయిస్తే దాతల సహకారంతో పుస్తకాలు ఏర్పాటు చేసుకుంటామన్నారు.